ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సోమన్న బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి ప్రారంభం.. ఐదు రోజులపాటు వేడుకలు
- రాష్ట్ర నలుమూలల నుంచి భక్తుల రాక
- ఏర్పాట్లను పూర్తి చేసిన అధికారులు



పాలకుర్తిలోని శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి గుట్ట



ఆలయ గర్భగుడిలోని శివలింగం

పాలకుర్తి, మార్చి 6: జిల్లాలోనే అతిపెద్ద పుణ్యక్షేత్రమైన పాలకుర్తిలోని శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. ఆలయంలో ఐదు రోజుల పాటు బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. 7న అంకురార్పన, ధ్వజారోహణం, 8న స్వామి వారి కల్యాణ మహోత్సవం, 9న రథోత్సవం, బండ్ల తిరుగుట, 10న డోలారోహణం, వసంతోత్సవం, పుష్ప యాగం, సదస్యం, పల్లకీ సేవ, 11న అగ్నిగుండాలతో జాతర ఉత్సవాలు ముగుస్తాయి.

వివిధ రాష్ట్రాల భక్తుల రాక

శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి బ్రహోత్సవాలకు ప్రతి ఏడాది తెలంగాణ నుంచే గాకుండా ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, కర్నాటక రాష్ట్రాల భక్తులు వందలాదిగా తరలివచ్చి స్వామి వారలను దర్శించుకుంటారు. అంతేగాకుండా విదేశాల నుంచి కూడా తెలుగు వారు తరలివస్తారని దేవస్థానం అధికారులు చెబుతున్నారు.

ఆలయ చరిత్ర..

తెలంగాణలో రెండవ యాదగిరిగుట్టగా ప్రసిద్ధి చెందిన శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. జనగామ జిల్లాలోనే పాలకుర్తి క్షీరగిరికి ప్రత్యేక చరిత్ర ఉంది. శ్రీ సోమేశ్వర లక్ష్మీ నర్సింహస్వామి దివ్య క్షేత్రంలో ఉన్న లింగం స్వయంభువు. గ్రామానికి వెలుపల పర్వతాగ్రముపైనున్నది. మునులు తపస్సు చేసిన సిద్ధ ప్రదేశం. ఇక్కడ నడినిశీధి ఆలయ గుహల నుంచి ఓంకార ప్రణవనాదం వినిపిస్తుందని భక్తుల విశ్వాసం. అదృశ్య రూపంలో ఉన్న సిద్ధ పురుషులు అర్ధరాత్రి వేళలో స్వామి వారిని అర్చించడానికి వస్తారని ప్రతీతి. ఈ క్షేత్రంను దర్శించు కున్న వారికి దివ్యమైన ఫలితం లభిస్తుంది. దక్షిణ భారతదేశంలోనే ఎక్కడాలేని విధంగా పాలకుర్తిలోనే క్షీరగిరి గుట్ట పై వేర్వేరు గుహల్లో ఒక గుహలో శివుడు(సోమేశ్వరుడి)గా మరో గుహలో విష్ణువు (లక్ష్మీనర్సింహస్వామి)గా వెలసి ఉన్నారు. శివకేశవులకు భేదం లేదని ప్రబోదిం చుచున్నారు. అందుకే హరిహర క్షేత్రంగా వర్ధిల్లుతోంది. ఈ దివ్య క్షేత్రం నందు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు పంచాహ్నిక దీక్షతో శైవాగం, వైదికాగం సంప్రదాయాను సారంగా పూజలు నిర్వహించడం జరుగుతుంది. ఈ దేవాలయంలో సూర్యభగవానుడి విగ్రహం కూడా కొలువై ఉంది.

రక్షక భటులుగా తేనెటీగలు..

శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి గుట్టపై ఉన్న తేనెటీగలు స్వామి వారలకు రక్షక భటులుగా ఉంటారని ప్రతీతి. ముఖ్యంగా స్వామి వారిని దర్శించుకు నేందుకు వచ్చే భక్తులు పుణ్య స్నానాలతో పవిత్రంగా ఉండాలని, లేని ఎడల తేనెటీగలు వెంబడించిన సంఘటనలు అనేకం ఉన్నాయని భక్తుల విశ్వాసం. ఇప్పటికి భక్తులు నిష్టతో స్నానమాచరించి భక్తిశ్రద్ధలతో స్వామి వారలను దర్శించుకొని మొక్కులు చెల్లిస్తుంటారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం..

- లక్ష్మీప్రసన్న, ఈవో పాలకుర్తి దేవస్థానం



శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి బ్రహోత్సవాలను విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నాం. వరంగల్, జనగామ, తొర్రూరు, సూర్యాపేట డిపోల నుంచి పాలకుర్తికి జాతర స్పెషల్ బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టారు. గుట్ట సమీపంలో భక్తులకు నిరంతరం తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పనకు కృషి చేస్తాం. మరుగుదొడ్లు, మూత్రశాలలు ఏర్పాటు చేశాం. గుట్టపైన దర్శనానికి వచ్చే భక్తులకు క్యూలైన్ల కోసం బారీకేడ్లు ఏర్పాటు చేశాం.

బ్రహ్మోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ రిజ్వాన్ బాషా



పాలకుర్తిలో గుట్టపై ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

పాలకుర్తి, మార్చి 6: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. పాలకుర్తిలోని సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో బ్రహోత్సవాల ఏర్పాట్లను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గుట్ట కింది భాగంలో చలువ పందిళ్లు, తాగునీటి నల్లాలను పరిశీలించారు. ఘాట్ రోడ్డు ద్వారా గుట్టపైకి ఎక్కి క్యూలైన్ల కోసం ఏర్పాటు చేసిన బారీకేడ్లను, చలువ పందిళ్లను పరిశీలించారు. ఈ ఐదు రోజుల పాటు విద్యుత్ సరఫరాలో కోత ఉండవద్దని అధికారులను ఆదేశించారు. పంచాయతీ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పారిశుధ్య సిబ్బందితో శుభ్రం చేయించాలన్నారు. భక్తుల కోసం ఆరోగ్యశాఖ క్యాంపును ఏర్పాటు చేసి 24 గంటలు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. జాతరలో ఎలాంటి ఘటనలు జరుగకుండా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. టీఎస్ఆర్టీసీ బస్సులను గుట్ట వరకు నడిపించాలన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ వెంకటేశం, ఎంపీడీవో రాములు, ఈవో లక్ష్మీప్రసన్న, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ప్రశాంతి ఉన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన దరఖాస్తుల కౌంటర్‌ను కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సందర్శించి తనిఖీ చేశారు.

నేడు సుశీలమ్మ వృద్ధాశ్రమం ప్రారంభం

హాజరు కానున్న నలుగురు మంత్రులు



ఆశ్రమ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జనగామ టౌన్, మార్చి 6: జనగామ మండలం శామీర్‌పేట శివారులో రూ.14 కోట్ల వ్యయంతో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన వృద్ధాశ్రమం ప్రారంభోత్సవం గురువారం జరుగనుంది. ఈ ఆశ్రమాన్ని ఇటీవల ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకుంది. ఆశ్రమం నిర్వహణకు ప్రభుత్వం 75శాతం, రుద్రమదేవి మహిళా సొసైటీ 25 శాతం ఖర్చును భరించనుంది. 144 మంది వృద్ధులు నివాసం ఉండేలా దీనిని రూపొందించారు. అత్యాధునిక హంగులతో, సకల సౌకర్యాలతో సుమారు మూడెకరాల విస్తీర్ణంలో ఈ ఆశ్రమాన్ని నిర్మించారు. దీనిని గురువారం ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు బుధవారం వృద్ధాశ్రమాన్ని అడిషనల్ కలెక్టర్ పింకేశ్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పరిశీలించారు. వసతులు, ప్రారంభోత్సవ ఏర్పాట్లపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వృద్ధాశ్రమ ప్రారంభోత్సవానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ధనసరి సీతక్క, కొండా సురేఖ, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. కాగా, కాంగ్రెస్ నాయకులు వేమల్ల సత్యనారాయణరెడ్డి, ఎర్రమల సుధాకర్, కంచ రాములు ప్రారంభోత్సవ ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.

సాదాసీదాగా మునిసిపల్ కౌన్సిల్ సమావేశం

వార్డుల్లోని సమస్యలను లేవనెత్తిన కౌన్సిలర్లు



సమస్యలు లేవనెత్తుతున్న బీజేపీ కౌన్సిలర్ హరిశ్చంద్రగుప్త

జనగామ టౌన్, మార్చి 6 : జనగామ మునిసిపల్ సాధారణ సమావేశం బుధవారం చైర్‌పర్సన్ పోకల జమున అధ్యక్షతన సాదాసీదాగా జరిగింది. పలువురు కౌన్సిలర్లు తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలను లేవనెత్తారు. కౌన్సిలర్లు మల్లిగారి చంద్రకళ, మంత్రి సుమలత మాట్లాడుతూ.. తమ వార్డుల్లో శానిటేషన్ సరిగ్గా జరగడం లేదని, కార్మికులు సమయపాలన పాటించడం లేదని ఆరోపించారు. బీజేపీ కౌన్సిలర్ హరిశ్చంద్రగుప్తా మాట్లాడుతూ.. సరైన డాక్యుమెంట్లు ఉన్నా భవన నిర్మాణ అనుమతులు ఇవ్వడం లేదని, సెకండ్ రిజిస్ట్రేషన్ ఉన్నవారికి మాత్రం అనుమతులు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. శానిటేషన్ విషయంలో జవాన్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కౌన్సిలర్ జక్కుల అనిత మాట్లాడుతూ.. తమ వార్డులో కరెంటు పోల్స్ వేయాలని రెండేళ్లుగా మొరపెట్టుకుంటున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. కౌన్సిలర్ పాక రమ మాట్లాడుతూ.. గుండ్లగడ్డ ప్రాంతంలో రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద మురుగునీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. గాదెపాక రాంచందర్ మాట్లాడుతూ.. మ్యుటేషన్ విషయంలో అధికారులు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. కౌన్సిల్ సమావేశానికి విలేకరులను అనుమతించాలని కోరారు.

అనంతరం ఆరు టేబుల్ అంశాలకు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ రాంప్రసాద్, ఏఈ మహేందర్, మేనేజర్ రాములు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మధు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే మహిళల అభివృద్ధి

వరంగల్ పార్లమెంట్ కమిటీ కన్వీనర్ యుగేంధర్‌రెడ్డి



ప్రధాని నరేంద్రమోదీ ప్రసంగాన్ని వీక్షిస్తున్న నాయకులు, మహిళలు

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 6 : బీజేపీతో మహిళల ఆర్థిక, సామాజిక, రాజకీయ అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ వరంగల్ పార్లమెంట్ కన్వీనర్ యుగేందర్‌రెడ్డి తెలిపారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లోని మా గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం 'నారీ శక్తి వందన్' కార్యక్రమం కన్వీనర్ బూర్ల విష్ణు ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ ప్రసంగం పశ్చిమబెంగాల్ రాష్ట్ర రాజధాని కోల్‌కత్తా నుంచి మహిళలను ఉద్దేశించి ప్రసంగించారు. నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి హాజరైన మహిళలు మోదీ ప్రసంగాన్ని భారీ స్ర్కీన్‌పై వీక్షించారు. ఈసందర్భంగా యుగేందర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే కుటుంబం బాగుపడుతుందనే నినాదంతో ప్రధాని మోదీ పథకాలను తీసుకువచ్చారని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం రూ.8 లక్షల కోట్లను వడ్డీ లేకుండా రుణాలుగా అందించిందన్నారు. 33 శాతం రిజర్వేషన్లు చట్టసభల్లో కల్పించడానికి గాను మహిళా బిల్లును తీసుకువచ్చిన చరిత్ర బీజేపీది అన్నారు. కార్యక్రమంలో నాయకులు భూర్ల విష్ణు, తోకల సంపత్‌రెడ్డి, నాగేష్‌గౌడ్, గంటె ఉపేందర్‌యాదవ్, బుర్ర తిరుపతి, సాకి సంపత్, గోనెల రాజు, రడపాక ప్రదీప్, తాళ్లపల్లి శ్రీనివాస్, బాస్కుల ఆరోగ్యం పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలి

ప్రజలపై భారం మోపుతున్న ప్రభుత్వం

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : ఎల్‌ఆర్‌ఎస్ కింద ప్లాట్లు, లే అవుట్లను ఉచితంగా క్రమబద్ధీకరించాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఎల్‌ఆర్‌ఎస్‌పై ఫీజు విధించడాన్ని నిరసిస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో బుధవారం జనగామ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్‌ఆర్‌ఎస్‌కు ఫీజు వసూలు చేయడం ద్వారా ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడుతుందన్నారు. అధికారంలోకి రాగానే ఎల్‌ఆర్‌ఎస్ కింద ఉచితంగా క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చి ప్రస్తుతం కాంగ్రెస్ మాట తప్పిందని విమర్శించారు. బీఆర్‌ఎస్ హయాంలో ఎల్‌ఆర్‌ఎస్ విషయంలో కాంగ్రెస్ నేతలు కోర్టుకు వెళ్లారని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ పాలనలో ప్రతి అంశంపై కాంగ్రెస్ విమర్శలు చేసిందని అన్నారు. తమ పథకాలనే కాంగ్రెస్ కొనసాగిస్తుందని, దానికి ఎల్‌ఆర్‌ఎస్సే నిదర్శనమన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా పేదల నుంచి డబ్బు దోచుకుంటోందని గతంలో తమ ప్రభుత్వంపై సీతక్క విమర్శలు చేశారని, ప్రస్తుతం మంత్రి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఉచితంగా క్రమబద్ధీకరిస్తామని మాట ఇచ్చి ప్రజల నుంచి రూ.20వేల కోట్లను దోచుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధపడిందన్నారు. ఎల్‌ఆర్‌ఎస్‌పై ఛార్జీలు విధించడం వల్ల రాష్ట్రంలోని 25 లక్షల కుటుంబాలపై ఆర్థిక భారం పడుతోందన్నారు. ప్రజలపై భారం పడేలా తీసుకున్న ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఎమ్మెల్యే పల్లా డిమాండ్ చేశారు. ధర్నాలో జడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, వివిధ మండలాలకు చెందిన బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



జనగామలో ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

ప్రభుత్వ వైఖరికి నిరసనగా రాస్తారోకో

పాలకుర్తి : ఎల్‌ఆర్‌ఎస్ పేరుతో ప్రభుత్వం ప్రజలను మోసం చేయడాన్ని నిరసిస్తూ పాలకుర్తిలోని రాజీవ్ చౌరస్తాలో బుధవారం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ మాట్లాడుతూ అబద్దాలతో ప్రజలను మోసం చేయడానికే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ముఖ్యంగా ఎల్‌ఆర్‌ఎస్ రద్దు చేస్తామని చెప్పి అధికారంలోకి రాగానే కొనసాగిస్తుందని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం పేరును ఎన్నికల్లో వాడుకొని లబ్ధి పొందడానికే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మాచెర్ల ఎల్లయ్య, పాము శ్రీనివాస్, వేణు, కళింగరావు, పోశాల వెంకన్న, శంకర్, దారా శంకరయ్య, కృష్ణమూర్తి, మూల వెంకటేశ్వర్లు, కమ్మగాని పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మరోమారు మేడిగడ్డకు ఎన్‌డీఎస్‌ఏ బృందం

- కుంగిన తర్వాత రెండోసారి డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందం రాక
- ఉదయం మేడిగడ్డ, మధ్యాహ్నం అన్నారం బ్యారేజీల పరిశీలన
- ప్రాజెక్టు లోపాలు, పునరుద్ధరణ అవకాశాలపై అధ్యయనం
- కీలకం కానున్న సిఫారసులు



మేడిగడ్డ బ్రిడ్జి

భూపాలపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్‌ఏ) బృందం మరోసారి సందర్శించనుంది. ఈ ప్రాజెక్టులోని పలు పిల్లర్లు కుంగిన తర్వాత రెండోసారి ఇక్కడకు వస్తున్న బృందం కాళేశ్వరం ప్రాజెక్టులో దెబ్బతిన్న మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల లోపాలు మరమ్మతులకు గల అవకాశాలను అధ్యయనం చేసే అవకాశం ఉంది. ఉదయం భూపాలపల్లి జిల్లా మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్, మధ్యాహ్నం అన్నారం సరస్వతి బ్యారేజీలను జాతీయ ఆనకట్టల భద్రత విభాగం నిపుణులు పరిశీలించనున్నారు. గతేడాది అక్టోబరు 21న మేడిగడ్డ బ్యారేజీలోని ఏడోబ్లాకులో పిల్లర్ నెంబర్ 19, 20, 21 కుంగిన విషయం తెలిసిందే. దీంతో మేడిగడ్డ బ్యారేజ్ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. దీనిపై రాజకీయంగా ప్రస్తుతం పెద్ద ఎత్తున దుమారం రేగుతోంది. ఈ క్రమంలో ఫిబ్రవరి 13న రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టు పునరుద్ధరణ, మరమ్మతులకు గల అవకాశాలను అధ్యయనం చేసి సిఫారసులు చేయాలని కోరడంతో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ నిపుణుల బృందం మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది. ఇప్పటికే గత ప్రభుత్వ హయాంలో ఎన్‌డిఎస్‌ఏ నిపుణుల బృందం ఒక దఫా ప్రాజెక్టును సందర్శించి వెళ్ళింది. ఈ పరిణామాల క్రమంలో ప్రభుత్వం మారడం కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారం రాజకీయ వివాదాలకు కేంద్ర బిందువుగా మారింది. ఇటీవలే అధికార కాంగ్రెస్, ప్రధాన విపక్షమైన బీఆర్‌ఎస్ నేతలు పోటాపోటీగా ప్రాజెక్టు సందర్శన కార్యక్రమాలు చేపట్టి ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ దెబ్బతిన్న పిల్లర్లను మరమ్మతు చేయాల్సింది పోయి పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి కోసం రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టి రాజకీయాలకు ప్రాజెక్టును అస్త్రంగా వాడుకుంటోందంటూ బీఆర్‌ఎస్ ఎదురుదాడికి దిగడంతో ప్రభుత్వం వీలైనంత తొందరగా ఈ రెండు ప్రాజెక్టుల భవితవ్యాన్ని తేల్చాలంటూ డ్యామ్ సేఫ్టీ అథారిటీకి లేఖ రాయడంతో ప్రస్తుతం నిపుణుల కమిటీ అధ్యయనానికి శ్రీకారం చుట్టింది..

బృందం పర్యటన సాగనుందిలా..

కాళేశ్వరం ప్రాజెక్టులో దెబ్బతిన్న మేడిగడ్డ అన్నారం బ్యారేజీలను అధ్యయనం చేసేందుకు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిపుణుల బృందం గురువారం రోజంతా మేడిగడ్డ, అన్నారం ప్రాజెక్టులను సుదీర్ఘంగా అధ్యయనం చేయనుంది.

- ఉదయం 9గంటలకు ఎన్‌డీఎస్‌ఏ బృందం మేడిగడ్డ చేరుకొని అల్పాహారం తర్వాత 9.30గంటలకు బ్యారేజీ తనిఖీల ప్రక్రియ ప్రారంభించి మధ్యాహ్నం ఒకటిన్నర వరకు దెబ్బతిన్న పిల్లర్లు, డిజైన్లలోపాలు, నిర్మాణ నాణ్యత, మరమ్మతులకు గల అవకాశాలు లాంటి అంశాలపై విస్తృతంగా అధ్యయనం చేస్తుంది.
- మధ్యాహ్నం ఒకటిన్నరకు మేడిగడ్డ వద్ద భోజనం ముగించుకుని రెండున్నర గంటలకు అన్నారం సరస్వతి బ్యారేజ్ వద్దకు చేరుకుంటుంది. మధ్యాహ్నం 3.15 నుండి సాయంత్రం ఆరున్నర గంటల వరకు సరస్వతి బ్యారేజ్‌ని పరిశీలించి నేరుగా రామగుండం వెళుతుంది. ఆ మరుసటి రోజు సుందిళ్ల బ్యారేజ్‌ని తనిఖీ చేయనున్నారు.

నిపుణుల కమిటీ సిఫారసులే కీలకం

దెబ్బతిన్న మేడిగడ్డ అన్నారం బ్యారేజీల భవితవ్యాన్ని ఎన్‌డిఎస్‌ఏ నిపుణుల బృందం ఇచ్చే నివేదికలే తేల్చనున్నాయి. నిపుణుల కమిటీ ప్రధానంగా 19 అంశాలపై సమాచారం అడిగినందున తనిఖీలలో వాటి పైనే ప్రధానంగా ఫోకస్ పెట్టే అవకాశాలున్నాయని భావిస్తున్నారు. ప్రాజెక్టు డిజైన్ మొదలు క్వాలిటీ కంట్రోల్, నిర్వహణ లాంటి అంశాలపై దృష్టి సారించే అవకాశం ఉంది. దెబ్బతిన్న ఏడో బ్లాకులోని పిల్లర్ల మరమ్మతులకు ఏ మేరకు అవకాశాలు ఉన్నాయి? మరమ్మతులు చేయిస్తే భవిష్యత్తులో ప్రాజెక్టు పరిస్థితి ఎలా ఉంటుంది? దెబ్బతిన్న పిల్లర్ల స్థానంలో మళ్లీ పునర్నిర్మించాలా? వద్దా? అనే అంశాలను నిపుణులు తేల్చే అవకాశాలున్నాయి.

మేడారం ఆదాయం రూ.13.25కోట్లు

పూర్తయిన అన్నికానుకల లెక్కింపు.. ఏడు రోజుల కౌంటింగ్‌కు తెర

హనుమకొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ద్వారా ఈ సారి మొత్తం రూ.13,25,22,511 కోట్ల ఆదాయం వచ్చిందని ఈవో రాజేంద్రం తెలిపారు. హుండీల లెక్కింపు మంగళవారమే పూర్తికాగా బుధవారం పసుపు, కుంకుమ, బెల్లంతో తడిసి ముద్దయిన నోట్లు, నాణాలను లెక్కించగా రూ.53,43,231గా తేలింది. ముద్దయిన నోట్లను సబ్బు నీళ్లలో నానబెట్టి శుభ్రం చేశారు. ఆరిన తర్వాత ఇస్త్రీ చేసి తిరిగి పూర్వరూపానికి తీసుకువచ్చారు. ఈసారి నాణాలు పెద్దమొత్తంలో వచ్చాయి. అయిదు పెద్ద నీళ్ల ప్లాస్టిక్ డమ్ములు నిండాయి. వీటిని డినామినేషన్ల ప్రకారం వేరు చేశారు. వాటిని బ్యాంకు అధికారుల సమక్షంలో తూకం వేసి లెక్కకట్టారు. నోట్లతో పాటు నాణాలను బ్యాంకులో జమ చేశారు. అన్నిటి లెక్కింపు పూర్తయినందువల్ల బుధవారంతో ఏడురోజుల పాటు సాగిన కౌంటింగ్‌కు తెరపడిందని సమ్మక్క సారలమ్మ జాతరు ఈవో రాజేంద్రం తెలిపారు.

ఫిబ్రవరి 29నుంచి హుండీలలెక్కింపు ప్రారంభమైంది. లెక్కింపులో మొత్తం 350 మంది దేవాదాయ, రెవెన్యూ, పోలీసు సిబ్బందితో పాటు స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు పాల్గొన్నారు. లెక్కింపులో పాల్గొన్నవారు డ్రెస్‌కోడ్ పాటించారు. లెక్కింపు సందర్భంగా ఎలాంటి అక్రమాలు, పొరపాట్లు జరగకుండా పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశారు. లెక్కింపు కేంద్రం చుట్టూరా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. లెక్కింపు కేంద్రం లోపల, బయట భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. లెక్కించిన నగదును ఎప్పటికప్పుడు బ్యాంకులో జమచేశారు. నగదును, బంగారం, వెండి బంగారం కానుకలను చివర మదింపువేసి బ్యాంకులాకర్‌లో భద్రపరిచారు. పోలీసు, రెవెన్యూ, దేవాదాయ శాఖల సహకారంతో సీసీ కెమెరాల నిఘా మధ్య హుండీల లెక్కింపు ఏడు రోజుల పాటు ప్రశాంతవాతారణంలో నిర్వహించారు. ఈ సారి హుండీల్లోని నాణాలు, బంగారం, వెండి వస్తువులను జల్లెడ పట్టడానికి ప్రత్యేకంగా ఒక యంత్రాన్ని ఏర్పాటు చేశారు. దీనివల్ల హుండీల లెక్కింపు వేగవంతగా జరిగింది. గతంలో హుండీల లెక్కింపు పూర్తయ్యేసరికి పది, పదకొండు రోజుల పట్టేది. ఈ సారి ఆరు రోజుల్లో పూర్తి చేశారు. బుధవారంతో మొత్తం 540 హుండీలను లెక్కించారు. నగదుతో పాటు హుండీల్లో భక్తులు వేసిన బంగారు, వెండి కానుకలను కూడా తూకం వేసి వాటి విలువను మదింపు వేశారు.

వాడిపోతున్న పండ్ల తోటలు!

నల్లగొండ జిల్లాలో బత్తాయి, నిమ్మతోటలకు నీటిగండం.. అడుగంటిన భూగర్భ జలాలు

- పంట నష్టం రూ.180 కోట్ల దాకా
- సర్కారు చొరవ చూపాలని రైతుల వినతి

నల్లగొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నల్లగొండ జిల్లాలో పండ్లతోటల రైతులకు నీటిగండం వెంటాడుతోంది. భూగర్భజలాల నీటిమట్టాలు రోజురోజుకీ పడిపోతుండటంతో వాటి ఆధారంగా సాగు చేసిన బత్తాయి, నిమ్మతోటలకు తీవ్ర నీటికొరత ఏర్పడింది. కనగల్లు మండలం చర్లగౌరారం, గుర్రంపోడు మండలం పోచంపల్లి సహా జిల్లావ్యాప్తంగా సుమారు 60వేల ఎకరాల్లో బత్తాయి, మరో 12 వేల ఎకరాల్లో వేసిన నిమ్మతోటలు నీరందక వాడిపోతున్నాయి. తోటలను కాపాడుకోవాలనే ఆశతో రైతులు లెక్కకుమిక్కిలిగా బోరుబావులు తవ్వుతున్న పరిస్థితి జిల్లా వ్యాప్తంగా ఏర్పడింది. నాన్ ఆయకట్టు ప్రాంతాలైన నల్లగొండ, దేవరకొండ డివిజన్లతో పాటు, మిర్యాలగూడ డివిజన్‌లోని మెట్ట ప్రాంతాల్లో ఈ కరువు పరిస్థితి కనిపిస్తోంది. జిల్లాలోని మెట్ట ప్రాంతాల్లో దాదాపు 300 నుంచి 500 అడుగుల లోతువరకు బోర్లు తవ్వినా, నీరు కనిపించకపోవడంతో రైతాంగం నైరాశ్యంలో మునిగింది. పండ్ల తోటలను సంరక్షించుకునేందుకు రైతులు ఒక్కొక్కరు 10, 20 వరకు బోర్లు వేస్తూ ఆర్థికంగా మరింత దెబ్బతింటున్న పరిస్థితి నెలకొంది. ఇదే పరిస్థితి కొనసాగితే జిల్లావ్యాప్తంగా బత్తాయి, నిమ్మ రైతులు సుమారు రూ.180 నుంచి రూ. 200 కోట్ల వరకు నష్టపోవాల్సి వస్తుందని చెబుతున్నారు. చెట్లు కూడా ఎండిపోతే మరింత నష్టపోవాల్సి ఉంటుందని, 10, 15 ఏళ్ల పాటు చేసిన శ్రమంతా వృథా అవుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఏఎమ్మార్పీ, వరద కాల్వల ద్వారా వీలైనన్ని చెరువులను నీటితో నింపితే భూగర్భజలాలు అందుబాటులోకి వస్తాయని, తద్వారా పంట నష్టపోయినా.. తోటలైనా దక్కుతాయని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. సాగర్‌లో నిల్వలు లేనందున ఎగువన ఉన్న ఆల్మట్టి నుంచి నీటిని విడుదల చేయిస్తే ఆదుకున్నట్లవుతుందని, ఈ మేరకు ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని రైతులు కోరుతున్నారు.



నల్లగొండ జిల్లా చిన్నఅడిశర్లపల్లిలో బోరుబావి నీళ్లు తగ్గడంతో వచ్చే కొద్దినీటిని పైపుల ద్వారా బత్తాయి చెట్లకు పోస్తున్న రైతు కూరలింగయ్య

పశువుల మేతగా వరి పొలం

కూసుమంచి: యాసంగిలో వరి సాగు చేయొద్దని అధికారులు సూచించినా చాలామంది రైతులు పాలేరు పాతకాల్వ ఆయకట్టులో వరిసాగు చేశారు. అయితే పంట చివరి దశకు వచ్చిన ప్రస్తుత సమయంలో నీరు అందకపోవడంతో వరిపొలాలు ఎండిపోతున్నాయి. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జక్కేపల్లి, పెరికశింగారంలో వరిపొలాలకు సాగునీరు అందకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. పాలేరు నుంచి నీరు విడుదల చేయాలని రైతులు మొన్నటిదాకా ఆందోళనలు చేశారు. అధికారులు స్పందించకపోవడంతో పాతకాల్వ పరిధిలో ఎండిపోతున్న వరి పొలాల్లో రైతులు తమ పశువులను మేపుతున్నారు.

చెరువులు నింపే కార్యాచరణ చేపట్టాలి



నాకు ఆరెకరాల బత్తాయి తోట ఉంది. భూగర్భజలాలు అడుగంటడంతో గతంలో ఉన్న బోరుబావులు నీరు పోయడం లేదు. నీళ్లందక తోట వాడిపోతోంది. ఇటీవల మూడు బోర్లు వేయించాను. చివరి బోరు 500 ఫీట్లవరకు వేసినా చుక్కనీరు రాలేదు. తోట ఎండితే భారీగా నష్టపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం తక్షణమే ఏఎమ్మార్పీ ద్వారా చెరువులు నింపేందుకు చర్యలు తీసుకోవాలి.

- పోలేని యాదయ్య, బత్తాయి రైతు, పోచంపల్లి, నల్లగొండ

నీళ్లు లేక నిమ్మతోట ఎండుతోంది



నాకు రెండు ఎకరాల నిమ్మతోట ఉంది. మరో నాలుగెకరాల్లో వరి కూడా వేశాం. గతంలో నాలుగు బోర్లుంటే ఎండిపోయాయి. ఇటీవల మళ్లీ నాలుగు బోర్లు వేసినా చుక్క నీరు పడలేదు. నిమ్మతోట ఎండిపోతే ఎకరాకు కనీసం లక్షవరకు నష్టపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకొని మమ్మల్ని ఆదుకోవాలి.

- సత్తిరెడ్డి, నిమ్మరైతు, చర్లగౌరారం, నల్లగొండ జిల్లా


నాలుగు పర్యాటక ప్రాజెక్టులకు

నేడు ప్రధాని శంకుస్థాపన

హైదరాబాద్/వికారాబాద్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రూ.137.76 కోట్ల అంచనా వ్యయంతో రాష్ట్రంలో చేపట్టనున్న నాలుగు పర్యాటక ప్రాజెక్టులకు ప్రధాని నరేంద్ర మోదీ గురువారం మధ్యాహ్నం శంకుస్థాపన చేయనున్నారు. ఆలంపూర్‌లోని జోగులాంబ ఆలయం, భువనగిరి జిల్లాలోని భువనగిరి కోట, వికారాబాద్ జిల్లాలోని అనంతగిరి కొండలు, హైదరాబాద్‌లోని బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద చేపట్టే వివిధ అభివృద్ధి పనులను మోదీ వర్చువల్‌గా ప్రారంభిస్తారు. స్వదేశీ దర్శన్, ప్రసాద్ పథకాల కింద దేశ వ్యాప్తంగా 52 పర్యాటక కేంద్రాలను ఎంపిక చేసిన కేంద్రం దాదాపు రూ.1325.76 కోట్ల వ్యయంతో ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టనుంది. ఇందులో భాగంగా ఆలంపూర్‌లోని జోగులాంబ ఆలయం అభివృద్ధికి, వసతుల కల్పనకు ప్రసాద్ పథకం కింద రూ.38.90 కోట్లు కేటాయించింది. అలాగే, భువనగిరి కోట ప్రాంతంలో విశ్రాంతి భవనాలు, పార్కులు, హరితవనాల అభివృద్ధికి, కోటపైకి చేరుకునేందుకు రోప్‌వే నిర్మాణానికి తొలి దశలో రూ.56.81 కోట్లు కేటాయించింది. హైదరాబాద్‌లోని బల్కంపేట ఎల్లమ్మ ఆలయ ప్రాంతంలో భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పనకు ప్రసాద్ పథకం కింద రూ.4.05 కోట్లు కేటాయించారు. తెలంగాణ ఊటీగా ఖ్యాతి పొందిన అనంతగిరి కొండలు, అక్కడి అటవీ ప్రాంతాల్లో వసతుల కల్పనకు రూ.38 కోట్లు కేటాయించారు. ఆయా పనులు గురువారం ప్రారంభం కానున్నాయి. అనంతగిరి కొండలను ఎకో టూరిజం హబ్‌గా తీర్చిదిద్దనున్నారు. ఇందులో భాగంగా మొత్తం రూ.98 కోట్లతో అభివృద్ధి పనులను నాలుగు ప్యాకేజీలుగా చేపట్టనున్నారు.

తాగునీటికి కష్టమే!

(మొదటి పేజీ తరువాయి)



ఎల్లంపల్లి ప్రాజెక్టు (ఫైల్)

హైదరాబాద్ తాగునీటి అవసరాలకే తరలించాలని మంత్రి పొన్నం తాజాగా అధికారులను ఆదేశించినా.. ఆ నీళ్లలో గరిష్ఠంగా ఏడు టీఎంసీల దాకానే వచ్చే అవకాశం ఉండటంతో పట్నంలో ఈ వేసవిలో తాగు నీటికి కటకట తప్పదనే అంచనాలకు బలం చేకూరుతోంది. బుధవారం సచివాలయంలో జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డు తదితర విభాగాల అధికారులతో బీసీ సంక్షేమ శాఖ, హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ పరిధిలో నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. కృష్ణా, గోదావరి బ్యారేజీల్లో ఉన్న నీటి మట్టాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తదనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం ఎల్లంపల్లి నుంచి 10 టీఎంసీలు వినియోగించుకోవాలని సూచించారు. ఎల్లంపల్లి నీటిని గజ్వేల్, దుబ్బాక, సిద్దిపేటకు ఇవ్వకుండా హైదరాబాద్‌కు తరలిస్తున్నారనే ప్రచారంలో వాస్తవం లేదని చెప్పారు. నీటి సరఫరా, రంజాన్‌లో ఏర్పాట్లు, వర్షాకాలంలో ముంపు ముప్పు నివారణ చర్యలపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. 2017 అనంతరం ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా, నగరంలో తాగునీటికి ఇబ్బందులు లేవని మంత్రికి అధికారులు వివరించారు. వేసవితో పాటు రంజాన్ మాసంలో అవసరాల కోసం నీటి ట్యాంకర్లు 24 గంటలు సరఫరా చేసేలా ఏర్పాట్లు చేసుకోవాలని, ఇందుకు ఆర్థిక ఇబ్బందులుంటే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పొన్నం చెప్పారు. విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోపు తాగునీరు, ఇతరత్రా వసతులకు సంబంధించిన చర్యలు చేపట్టాలన్నారు. గతంలో జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకొని వర్షాకాలంలో ముంపు ముప్పు, ప్రాణ నష్టం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మ్యాన్ హోల్‌లు తెరిచి ఉంటే ప్రమాదకరం అని, అలాంటి చోట్ల సిబ్బంది పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సచివాలయం ముందు భారీగా వరద నీరు నిలుస్తోందని అధికారులు చెప్పడంతో ఆర్ అండ్ బీ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారనికి చొరవ తీసుకుంటామని పేర్కొన్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా పోలీసులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల కోడ్ రాక ముందే ప్రారంభించే పనులుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని చెప్పారు.

ఎల్లంపల్లి నీరొచ్చినా దాహ'మే'!

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు అడుగంటుతోంది. పదేళ్లుగా ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది నీటి నిల్వలు భారీగా పడిపోయాయి. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడంతో కాళేశ్వరం నుంచి నీటి లభ్యత కూడా లేకుండాపోయింది. ప్రాజెక్టుకు తక్షణ నీటి సరఫరాకు అనుగుణంగా ఉండే కడెం ప్రాజెక్టులో కూడా నీటి నిల్వలు అడుగంటాయి. మార్చి 2వ తేదీ లెక్కల ప్రకారం 10.48 టీఎంసీల నీరే ఉంది. ఇక 7.66 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన కడెంలో ప్రస్తుతం 3.88టీఎంసీల నీరే ఉంది. ఇందులో డెడ్ స్టోరేజీ కింద 2.8 టీఎంసీలను మినహాయిస్తే ప్రాజెక్టు నుంచి ఒక టీఎంసీ మాత్రమే ఎల్లంపల్లికి తీసుకునే అవకాశం ఉంది. పైగా ఎల్లంపల్లి ప్రాజెక్టులో నాలుగు టీఎంసీల కన్నా ఎక్కువ ఉంటేనే హైదరాబాద్‌కు నీటిని సరఫరా చేసేలా పంప్‌హౌస్‌ను ఏర్పాటు చేశారు. అంటే ఎల్లంపల్లికి కడెం నుంచి ఓ టీఎంసీ నీరు విడుదల చేసినా గరిష్ఠంగా ఏడు టీఎంసీలనే హైదరాబాద్‌కు తరలించే అవకాశం ఉంటుంది. ఈ నీళ్లు మార్చి, ఏప్రిల్ మాసాల్లో హైదరాబాద్‌కు తాగు నీటి అవసరాలు తీరుతాయని.. మే, జూన్ నెలల్లో మాత్రం తాగునీటికి కటకట తప్పదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నాగార్జున సాగర్‌లో కూడా 515 లెవల్ వరకు నీళ్లు ఉన్నాయి. ఈ నీళ్లు మరో 5 ఫీట్ల మేర పడిపోతే హైదరాబాద్‌కు నీటి సరఫరా తగ్గొచ్చని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి

శ్రీరాంసాగరే దిక్కు

ఎండాకాలంలో హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం శ్రీరాంసాగరే ప్రత్యామ్నాయంగా కనిపిస్తోంది. శ్రీరాంసాగర్‌లో 40టీఎంల నీటి నిల్వలున్నాయి. ప్రధానంగా ఇక్కడి నీటిని సాగు అవసరాలకే వాడుతున్నారు. శ్రీరాంసాగర్ నుంచి ఎల్లంపల్లికి నీటిని విడుదల చేస్తే తాగునీటి గండం నుంచి గట్టెక్కొచ్చు. అయితే ఈ విషయంలో నీటిపారుదల శాఖ అధికారులు స్పందించకపోవడం హైదరాబాద్ వాటర్‌వర్క్స్ అధికారులను ఆందోళనకు గురిచేస్తోంది. సీఈలు, ఎస్ఈల స్థాయిల్లో చర్చకు పెట్టినా ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో చలనం లేకపోవడం కలవరపెడుతోంది.

కాలుష్య నియంత్రణ బోర్డులో

అవినీతి అధికారులు

- మండిపడిన హైకోర్టు
- సుమోటోగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచన

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (టీపీసీబీ)లో అవినీతి అధికారులు ఉన్నారంటూ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పీసీబీని సంపూర్ణ ప్రక్షాళన చేసే దిశగా ఇలాంటి అధికారులపై సుమోటోగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి సూచించింది. రంగారెడ్డి జిల్లా గగన్‌పహాడ్‌లో ఉన్న ఫ్రోస్టర్స్ అనే కంపెనీకి జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ జారీచేసిన కంపెనీ మూసివేత నోటీసును హైకోర్టు కొట్టేసింది. వాటర్ (ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ ఆఫ్ పొల్యూషన్) యాక్ట్ - 1988 ప్రకారం ఎందుకు చర్యలు తీసుకోరాదో వివరించాలని ఆ పీసీబీ అధికారి పిటిషనర్ కంపెనీకి షోకాజ్ నోటీసులు జారీచేశారు. చట్టంలోని నిబంధన ప్రకారం ప్లాస్టిక్ వాషింగ్ యూనిట్‌కు అనుమతి అవసరం లేదంటూ ఆ కంపెనీ సమాధానం ఇచ్చింది. కంపెనీ ఇచ్చిన వివరణను పట్టించుకోకుండా, తమ నోటీసులకు ఎలాంటి సమాధానం ఇవ్వలేదని పేర్కొంటూ అధికారి క్లోజర్ ఆదేశాలు జారీచేశారు. మూసివేత ఆదేశాలను సవాల్ చేస్తూ కంపెనీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. 'రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాల్లో ఇదో బాధాకరమైన విషయం. పొల్యూషన్ కంట్రోల్ బోర్డులోని అవినీతి అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. పీసీబీ వ్యవస్థను పారదర్శకంగా మార్చాలి. గత ఏడునెలలుగా మేం పీసీబీ పనితీరును గమనిస్తున్నాం. కొంత మంది అధికారులు షోకాజ్ నోటీసులు ఇస్తారు.. మరి కొంత మంది అధికారులు వచ్చి ఎలాంటి సమాధానం రాలేదంటూ తుది ఆదేశాలు ఇస్తారు. సామర్థ్యం లేని అధికారులను మారుమూల ప్రాంతాలకు బదిలీ చేయాలి' అని వ్యాఖ్యానించింది. సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా జారీచేసిన మూసివేత ఉత్తర్వులు చెల్లవని పేర్కొంటూ వాటిని కొట్టేసింది. ఈ పనిని వేరే అధికారికి అప్పగించి.. 15 రోజుల్లో తాజా ఆదేశాలు జారీచేయాలని స్పష్టం చేసింది. 15 రోజుల్లో తాజా ఆదేశాలు ఇవ్వకపోతే కోర్టు ధిక్కరణ చర్యలు చేపడతామని స్పష్టం చేసింది.

ఎల్ఆర్ఎస్‌పై బీఆర్ఎస్ రాజకీయం!

- కేటీఆర్‌కు కోదండరెడ్డి ప్రశ్న

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్‌పై బీఆర్ఎస్ పార్టీ రాజకీయం చేస్తోందని... ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అక్రమ లే అవుట్లు వేస్తుంటే నిద్రపోయారా అని కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి ప్రశ్నించారు. ఎల్ఆర్ఎస్‌పై ఇచ్చిన రెండు జీవోలూ గత ప్రభుత్వం ఇచ్చినవేనని, కేటీఆర్ మంత్రిగా ఉన్నప్పుడు ఇచ్చిన ఆ జీవోల్లోనే ధరలూ నిర్ణయించారన్నారు. గాంధీ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కోదండరెడ్డి మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు అమాయక ప్రజల నుంచి డబ్బులు లాక్కునే ప్రయత్నం చేసిన కేటీఆర్.. ఇప్పుడేమో ఉచితంగా రెగ్యులరైజ్ చేయాలంటూ చెబుతున్నారన్నారు. హౌసింగ్ బోర్డు ద్వారా పేదలకు ఇళ్లు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనే అన్నారు. కోకాపేటలో పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం భూమి ఇస్తే.. కేసీఆర్ వాటిని లాక్కుని బిల్డర్లకు ఇచ్చారన్నారు. ఔటర్ రింగ్ రోడ్డును ప్రైవేటు కంపెనీకి అప్పగించేశారన్నారు. జీవో 111 పరిధిలోని భూములనూ ఆక్రమించారన్నారు. వీటన్నిటిపైనా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి ఓటర్ల వివరాలు ఇవ్వండి

- ఎన్నికల అధికారులకు హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పార్లమెంటరీ నియోజకవర్గంలో పోలింగ్ స్టేషన్‌ల వారీగా ఇంటినంబర్లతో కూడిన మ్యాప్ (నజ్రీ నక్ష)లను మాజీ ఎంపీ, ఆ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి అందజేయాలని ఎన్నికల అధికారులకు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ గతేడాది జారీచేసిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌వోపీ) ప్రకారం నజ్రీ నక్ష అందజేయాల్సి ఉండగా అందుకు ఎన్నికల అధికారులు నిరాకరిస్తున్నారని పేర్కొంటూ ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎల్. రవిచందర్ వాదనలు వినిపిస్తూ.. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గంలో 2.40 లక్షల మంది నకిలీ ఓటర్లు ఉన్నారని.. హైదరాబాద్‌లో 1.65 లక్షల మంది వరకు ఉన్నారని ఆరోపించారు. ఎన్నికల అధికారులు ఇంటి నెంబర్లతో కూడిన నజ్రీ నక్షలను బయటపెట్టకపోవడం వల్ల ఓటర్ల జాబితాలో అక్రమాలకు అవకాశం ఏర్పడుతోందని పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం తరఫు సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయి వాదనలు వినిపిస్తూ.. ఫొటోలతో కూడిన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా, ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలోని ఏరియాను ప్రతిబింబించే నజ్రీ నక్షను ఆయా రాజకీయ పార్టీలకు ఎన్నికల అధికారులు అందజేస్తారని పేర్కొన్నారు. తగిన మొత్తంలో రుసుము చెల్లిస్తే పిటిషనర్‌కు నక్ష అందజేయడానికి అభ్యంతరం లేదని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. ఖర్చులు స్వీకరించి పిటిషనర్ కోరిన విధంగా నజ్రీ నక్ష అందజేయాలని ఆదేశించింది.

బీఆర్ఎస్ బలహీనపడింది

- పొత్తులతో అది స్పష్టం: నిరంజన్

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీతో పొత్తు పెట్టుకోవడం ద్వారా బీఆర్ఎస్ పార్టీ ఎంత బలహీనపడిందో స్పష్టమైందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ అన్నారు. బీఆర్ఎస్ నేతలు ఆ పార్టీని వీడి వెళుతుండడంతో ఉనికిని కాపాడుకునేందుకు కేసీఆర్ నానా తంటాలు పడుతున్నారన్నారు. నిబద్ధత గల అధికారిగా పేరున్న ప్రవీణ్‌కుమార్‌కూ ఇది ఒక చెరగని మచ్చ అన్నారు. దళితుడిని తెలంగాణకు తొలి సీఎంగా చేస్తానని చెప్పి మాట తప్పినందుకు కేసీఆర్ పంచన చేరారా... అంటూ ప్రవీణ్‌కుమార్‌ను ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని ఏక్‌నాథ్ షిండేగా పేర్కొంటున్న కేటీఆర్.. హింసించే రాజు 23వ పులకేశి అంటూ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కైలాష్ నేత ధ్వజమెత్తారు. బీఆర్ఎస్‌ను కేసీఆర్ హోల్‌సేల్‌గా బీజేపీకి అమ్మకానికి పెట్టారన్నారు. ప్రవీణ్‌కుమార్‌ని పెంచి పోషించింది బీఆర్ఎస్ పార్టీనేనని, అది ఇప్పుడు బట్టబయలైందని అన్నారు. గాంధీభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈమేరకు మాట్లాడారు.

గాంధీభవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గాంధీభవన్‌లో బుధవారం మహిళాకాంగ్రెస్ ఆధ్వర్యంలో వేడుక జరిగింది. మహిళా కాంగ్రెస్ నేతలు భారీ కేక్‌ను కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ వేడుకల్లో మంత్రి కొండా సురేఖ, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీడ్ కార్పొరేషన్‌లో సిత్రాలెన్నో!

(మొదటి పేజీ తరువాయి)

ఆర్భాటంగా ప్రకటించగా.. గడిచిన పదేళ్లలో విత్తనోత్పత్తి కాస్తా ఏటా నేలచూపులు చూస్తూ.. అథఃపాతాళానికి పడిపోయింది. విత్తనాల నాణ్యతను ధ్రువీకరించే 'సీడ్ సర్టిఫికేషన్ అథారిటీ'లోనూ అన్నీ అవకతవకలే.! ఇక్కడ సిబ్బంది బయోమెట్రిక్ ఉండదు. ఇద్దరు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది అసలు విధుల్లోకే రారు. సంతకాలు చేయరు. తొమ్మిదేళ్లుగా జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రిన్సిపల్ సైంటిస్ట్‌గా, సీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ హెచ్‌వోడీగా, సీడ్ కార్పొరేషన్ ఎండీగా కె.కేశవులు పనిచేస్తున్నారు. ఈ తొమ్మిదేళ్లలో రికార్డు స్థాయిలో 28 విదేశీ పర్యటనలు చేశారు. ఏ ముఖ్యమంత్రి గానీ, మంత్రులు గానీ ఇన్ని విదేశీ పర్యటనలు చేయకపోవడం విశేషం. పైగా.. 2022 అక్టోబరులో నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో కె.కేశవులు స్వస్థలమేది? అంటూ ఓ ప్రశ్న రావడం గమనార్హం!

గ్రో ఔట్ టెస్ట్ నిధులెక్కడ?

విత్తనాభివృద్ధి కోసం గ్రో ఔట్ టెస్ట్(జీవోటీ) ఫామ్ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.50 లక్షలను మ్యాచింగ్ గ్రాంట్ కింద అందజేశాయి. రాజేంద్రనగర్‌లోని జయశంకర్ వర్సిటీ ప్రాంగణంలో ఈ ఫామ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. ఇప్పుడు అక్కడ పాడుబడ్డ ఓ గేటు, చెట్లు పొదలు, ముళ్ల కంపలు తప్ప. అక్కడ ఫామ్ లేదు. అయితే.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలిచ్చిన రూ.కోటి నిధులు ఎక్కడ? అనేది ఇప్పుడు ప్రశ్నగా మారింది. ఒక్క విత్తన గింజను ఉత్పత్తిచేయకున్నా.. యూసీలు మాత్రం సమర్పించారు. తెలంగాణను 'సీడ్ బౌల్ ఆఫ్ ఇండియా'గా చేస్తామంటూ గత ప్రభుత్వం చేసిన ప్రకటన ఆర్భాటాలకే పరిమితమైంది. లక్షల నిధులు కేటాయించినా.. విత్తనోత్పత్తి పెరగకపోగా.. సీడ్ కార్పొరేషన్‌లో పదేళ్లుగా నేలచూపులు చూస్తోంది. ఎగుమతులు క్షీణించాయి. 2014-15లో సీడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన విత్తనోత్పత్తి 3.18 లక్షల క్వింటాళ్లు కాగా.. 2021-21లో 1.56 లక్షల క్వింటాళ్లు, 2022-23లో 1.78 లక్షల క్వింటాళ్లకు పడిపోయింది. విత్తన పంపిణీ 2014-15లో 3.36 లక్షల క్వింటాళ్లుగా ఉండగా.. 2022-23లో అది 3.05 లక్షల క్వింటాళ్లకు పడిపోయింది. సీడ్ సర్టిఫికేషన్ ఏజెన్సీలో రిజిస్ట్రేషన్లు కూడా గణనీయంగా పడిపోయాయి. 2015-16తో పోలిస్తే.. 2022-23కల్లా ఈ రిజిస్ట్రేషన్లు 1.65 లక్షల మేర తగ్గిపోయాయి.

ఇస్టా కాంగ్రెస్‌కు ఇష్టారాజ్యంగా నిధులు

హైదరాబాద్‌లో 2019 జూన్ నెలలో 32వ ఇస్టా కాంగ్రెస్ సదస్సును నిర్వహించారు. 75 దేశాల నుంచి 451 మంది ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరైనట్లు ఇస్టా కాంగ్రెస్ నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరించిన టీఎస్-ఎస్‌వోసీఏ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.కేశవులు అప్పట్లో వెల్లడించారు. ఈ సదస్సు నిర్వహణకు అప్పట్లో రైతుబంధు' నిధులను మళ్లించినట్లు ఫిర్యాదులు వచ్చాయి. సుమారు రూ.10 కోట్ల నిధులను ఇస్టా కాంగ్రెస్ సదస్సుకు ఖర్చు చేశారు. ఇందులో పెద్దమొత్తంలో నిధులు దుర్వినియోగమైనట్లు ఆరోపణలున్నాయి. మూడు రోజులకు నోవాటెల్ హోటల్ హాలు, భోజనాలకే రూ.70 లక్షల ఖర్చు రాశారు. డెలిగేట్స్ గదులకు రూ.25 లక్షలు, స్టాల్స్ ఏర్పాటుకు రూ.43.12 లక్షలు, కార్నివాల్ ఏర్పాట్లకు రూ.20.37 లక్షలు, తాజ్ హోటల్స్‌లో ఫుడ్ అండ్ బేవరేజెస్‌కు రూ.26.34 లక్షలు, సాంస్కృతిక కార్యక్రమాలకు రూ.25.65 లక్షలు, ప్రచారానికి రూ.12 లక్షలు, హైటెక్స్‌లో స్టేజీ ఇతరత్రా ఏర్పాట్లకు రూ.20 లక్షలు, ఇస్టా వీడియో ఫిల్మ్‌లకు రూ.18 లక్షలు, ఎగ్జిబిటర్లు, అధికారుల ఫీజులకు రూ.52.75 లక్షలు, రైతుల సమావేశానికి రూ.56 లక్షలు, చిల్లర ఖర్చులకు రూ.15 లక్షలు వెచ్చించారు. చివరకు నోడల్ ఆఫీసర్ కేశవులు ఐ-ఫోన్ కోసం రూ.65 వేలను ఈ నిధుల్లోంచే ఖర్చుచేశారు. హైదరాబాద్‌లోని పలు స్టార్‌హోటళ్ల పేరుతో విచ్చలవిడిగా బిల్లులను సమర్పించారు. దీనిపై అప్పట్లో విమర్శలు వచ్చినా.. నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు.

ప్రైవేటు ఏజెన్సీలతోనే ఆడిటింగ్

తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ, విత్తన ధ్రువీకరణ సంస్థకు సంబంధించిన ఆడిట్‌ను ఏటా ప్రైవేటు ఏజెన్సీలతోనే చేయించారు. ఒక 2021-22లో మాత్రమే ఏజీ ఆడిట్ జరిగింది. ఆర్‌కేవీవై పథకంలో వరంగల్‌లో ఆఫీస్ బిల్డింగ్ పూర్తిగా నిర్మించకుండానే రూ.95 లక్షలకు యూసీలు సమర్పించినట్లు తెలుస్తోంది. మినీ బస్ కొనుగోలు, సబ్-మిషన్ ఆఫ్ సీడ్స్ అండ్ ప్లాంటింగ్ మెటీరియల్ నిధుల మళ్లింపు, వాహనాల నిర్వహణ, వ్యవసాయశాఖ కార్యదర్శి కార్యాలయంలో పనిచేసే టెక్నికల్ సిబ్బందికి వేతన చెల్లింపులు, ఈపీఎఫ్-ఈఎస్ఐ కాంట్రిబ్యూషన్, కాకాని కన్సల్టెన్సీకి చేసిన చెల్లింపులు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, సీడ్ టెస్టింగ్ ల్యాబ్ పేరుతో ఆర్‌కేవీవై నిధుల మళ్లింపులో జరిగిన అవకతవకలు ఏజీ ఆడిట్‌లో వెలుగుచూశాయి. మిగిలిన సంవత్సరాల్లో చిట్టిబాబు అండ్ కంపెనీ, సుబ్రమణ్యం అండ్ కంపెనీ అనే ఏజెన్సీలతో ఆడిట్ చేయించారు. అక్రమాలను కప్పి పుచ్చుకునేందుకే ప్రైవేటు ఏజెన్సీలతో ఆడిట్ చేయించినట్లు ఆరోపణలున్నాయి.

జీతం ఇక్కడ.. చేసేది ఆర్డర్లీ

సీడ్ సర్టిఫికేషన్‌లో ఉద్యోగంలో చేరిన ఇద్దరు ఔట్ సోర్సింగ్ సిబ్బంది.. విధులకు హాజరవ్వడం లేదు. బయోమెట్రిక్ వేయటం లేదు. ఒకరేమో హైదరాబాద్ లంగర్‌హౌస్‌లో నివాసముంటున్న ఏపీ మాజీ సీఎస్ ఇంట్లో పనిచేస్తున్నారు. మరొకరు ఆ మాజీ ఐఏఎస్ ఇంటిపక్కనే ఉండే సీడ్ కార్పొరేషన్ ఎండీ ఇంట్లో ఊడిగం చేస్తున్నట్లు సమాచారం. ఈ ఇద్దరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఏడాదికోసారి తెల్లకాగితాలపై సంతకాలు చేసి పంపుతున్నట్లు.. దాన్నే రెన్యూవల్ ఆఫ్ సర్వీసెస్‌గా అధికారులు రికార్డుల్లో పెడుతున్నట్లు తెలుస్తోంది.

విధుల్లో చేరిన ఎస్ఐ వినయ్‌కుమార్

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 6 : స్టేషన్‌ఘన్‌పూర్ రెండో ఎస్ఐగా బి.వినయ్‌కుమార్ బుధవారం విధుల్లో చేరారు. ఘన్‌పూర్ రెండో ఎస్ఐగా విధులు నిర్వహించిన హరికృష్ణ ఇటీవల బదిలీ అయ్యారు. ఆస్థానంలో చిలుపూరు ఎస్సైగా విధులు నిర్వహించిన వినయ్‌కుమార్ బదిలీపై ఘన్‌పూర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ కేంద్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు 95.50 శాతం విద్యార్థుల హాజరు

జనగామ కల్చరల్, మార్చి 6 : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు కొనసాగుతున్నాయి. జిల్లాలో బుధవారం జరిగిన పరీక్షల్లో విద్యార్థులకు సెట్-బి ప్రశ్నాపత్రం అందించారు. 4,265 మంది విద్యార్థులకు గాను 192 మంది గైర్హాజరు కాగా, 4,073 మందితో 95.50 శాతం హాజరైనట్లు డీఐఈవో బైరి శ్రీనివాస్ తెలిపారు. పరీక్షల సందర్భంగా డీఐఈవో పాలకుర్తి, జఫర్‌గఢ్ డెక్ సభ్యులు జనగామలోని టీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ, ప్రెస్టన్, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ముస్లిం మైనారిటీ స్కూల్, ఏబీవీ జూనియర్ కళాశాల, ఫ్లయింగ్ స్క్వాడ్ స్టేషన్‌ఘన్‌పూర్‌లోని టీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ, మోడల్ స్కూల్ జూనియర్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాలను సందర్శించినట్లు అధికారులు తెలిపారు.

రామలింగేశ్వరుడికి వెండి నాగ ప్రతిమ బహూకరణ

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, మార్చి 6 : స్టేషన్ ఘన్‌పూర్‌లోని పురాతన రామలింగేశ్వరాలయానికి బుధవారం వెండి నాగ ప్రతిమను బహూకరించారు. స్థానికంగా అద్దెకు ఉంటున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మురళీధర్, సంధ్య దంపతులు 2కిలోల వెండి నాగ ప్రతిమను పూజారులు రామలింగయ్య, శ్రవణ్‌లకు అందించారు. సంధ్య జఫర్‌గఢ్ మోడల్ స్కూల్‌లో టీచర్‌గా పని చేస్తున్నారు. బహూకరణ అనంతరం పరమ శివునికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దాతలను కమిటీ అభినందించింది.



శివాలయానికి వెండి నాగ ప్రతిమ అందిస్తున్న దంపతులు

సోమన్న బ్రహ్మోత్సవాలకు రండి

పాలకుర్తి, మార్చి 6: మహాశివరాత్రిని పురస్కరించుకొని పాలకుర్తిలోని శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో జరిగే బ్రహ్మోత్సవాలకు రావాలని దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్‌ను కోరారు. తెలంగాణ రాష్ట్ర అర్చక ఉద్యోగ జేఏసీ కన్వీనర్ డీవీఆర్ శర్మ హైదరాబాద్‌లో కలిసి బుధవారం ఆహ్వాన పత్రికను అందచేశారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ మహాశివరాత్రి రోజున పాలకుర్తిలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయని తెలిపారు. ఈ ఉత్సవాలకు అడిషనల్ కమిషనర్లు కోరాకుల జ్యోతి, కృష్ణవేణి, ఆర్‌జేసీ రామకృష్ణారావు, డిప్యూటీ కమిషనర్ కృష్ణప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్ శేఖర్‌లకు కూడా ఆహ్వాన పత్రికలను అందచేశారు. కార్యక్రమంలో అర్చకులు నాగరాజు, సతీష్ పాల్గొన్నారు.



దేవాదాయ కమిషనర్‌కు బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక అందచేస్తున్న పూజారులు

గ్రామాల్లో లేని వ్యక్తుల జాబితా రూపొందించాలి

▸▸ ఆర్డీవో డీఎస్ వెంకన్న



సూపర్ వైజర్లకు సూచనలు ఇస్తున్న ఆర్డీవో వెంకన్న

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 6: గ్రామాల నుంచి శాశ్వతంగా వెళ్లిపోయిన వారి పేర్లను జాబితాగా రూపొందించి ఓటరు జాబితా నుంచి తొలగించాలని ఆర్డీవో డీఎస్ వెంకన్న తెలిపారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లోని ఆర్డీవో కార్యాలయంలో బుధవారం నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన ఎన్నికల సూపర్‌వైజర్లతో ఓటరు జాబితాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్డీవో వారికి పలు సూచనలు చేశారు. ఓటరు జాబితా నందు మొదటి పేజీలో పోలింగ్ కేంద్రం నెంబరు, పోలింగ్ కేంద్రం పేరు, లొకేషన్ ఇతరాత్ర వివరాలు నమోదు చేయాలన్నారు. రెండు చోట్ల ఓటు ఉన్నవారి పేర్లను, మరణించిన వారి పేర్లను ఓటరు జాబితాలో నుంచి తొలగించి సవరణలు చేయాలన్నారు. ఫారం-6, 7, 8లను తీసుకోవడంతో పాటు కొత్త ఓటర్ల నమోదు, సవరణలు తదితర పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో ఆర్ఐలు అర్జున్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సిద్ధేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

▸▸ సిద్దులగుట్టకు భారీగా తరలివచ్చిన భక్తులు



పూర్ణకలశంతో తరలివస్తున్న ఆలయ అర్చకులు, అధికారులు

బచ్చన్నపేట, మార్చి 6: హరహర మహాదేవ.. శంభో సిద్ధేశ్వరా.. అంటూ భక్తుల శరణు ఘోష మధ్య ప్రముఖ శైవక్షేత్రం కొడవటూరు సిద్ధులగుట్టలో వెలిసిన స్వయంభూ సిద్ధేశ్వరుడి బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల పాటు జరిగే ఉత్సవాలను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఓం నమఃశివాయ ఆధ్వర్యంలో అర్చకులు సిద్ధేశ్వరుడి ఆలయ సమీపంలోని మహిమాన్విత జలం కలిగినదిగా భక్తజనం భావించే బావి వద్ద గంగపూజ చేయటం ద్వారా ఉత్సవాలను ప్రారంభించారు. ఇందుకు ప్రధానార్చకుడి ఇంటి నుంచి పూర్ణకలశం తీసుకుని వచ్చి గంగాజలంతో స్వామి వారి వద్దకు తరలివెళ్లే కార్యక్రమంతో సిద్ధేశ్వరుడికి స్వాగతం పలికినట్టుగా భావిస్తారని అర్చకులు తెలిపారు. ఈవో చిందం వంశీ, స్థానిక ఎంపీటీసీ నీల శైలజ రమేశ్, వివిధ ప్రాంతాల భక్తులు మొదటి రోజు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆవాహన దేవతాపూజ, రుత్వికరణము, పంచామృత శతరుద్రాభిషేకం, మంత్రపుష్పం, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు శతరుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, మంగళహారతి, మంత్రపుష్ప కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీశైలం, షాద్‌నగర్ వేద పాఠశాలల్లో చదివే విద్యార్థులు ప్రత్యేక పూజల్లో ఆకర్షణగా నిలిచారు. ప్రత్యేక పర్యవేక్షకులుగా జూనియర్ అసిస్టెంట్ చల్లా రాజేందర్‌రెడ్డి, మధు, లక్ష్మీకాంతరెడ్డి, భానుప్రకాశ్‌రెడ్డిలు వ్యవహరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో అర్చక బృందం మహాశివుడు, సదాశివుడు, నాయకులు మల్లం శ్రీనివాస్, బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

సిద్ధేశ్వరాలయ ఉత్సవ కమిటీ నియామకం

▸▸ చైర్మన్‌గా గాలి కృష్ణ



బచ్చన్నపేట, మార్చి 6 : మండలంలో ఉన్న ప్రముఖ శైవ క్షేత్రమైన కొడవటూరు సిద్ధులగుట్టకు ఉత్సవ కమిటీని రాష్ట్ర దేవాదాయ శాఖ నియమించింది. ఈ మేరకు బుధవారం అధికారులు ఓ ప్రకటన విడుదల చేశారు. 'ఆలయ కమిటీ నిర్మాణం మరిచారా' పేరిట ఆంధ్రజ్యోతిలో మంగళవారం కథనం ప్రచురితమైంది. ఆరేళ్లుగా కమిటీని నియమించటంలో నిర్లక్ష్యాన్ని ప్రశ్నించింది. దీంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమైన మొదటి రోజునే బుధవారం తాత్కాలికంగా ఉత్సవ కమిటీని ప్రకటించారు. గాలి కృష్ణ(కేశిరెడ్డిపల్లి), హరినాథ్(బచ్చన్నపేట), ఆలేటి సిద్ధిరాములు(జనగామ), ఆరేళ్ల భాస్కర్(బండనాగారం), నిమ్మ కరుణాకర్‌రెడ్డి(కొడవటూరు), ఈర్ల శివరాములు(పోచన్నపేట) వల్లాల సత్యం(గోపాల్‌నగర్), జంగిటి కళ్యాణి(నారాయణపూర్), పోచంపల్లి శ్రీనివాసు(బచ్చన్నపేట), నీల మధు(కేశిరెడ్డిపల్లి), సానికె రాజు(తమ్మడపల్లి), నూకల భూపాల్‌రెడ్డి(లక్ష్మాపూర్), బైరగోని కనకయ్య(ఇటుకాలపల్లి)లను నియమిస్తూ ఉత్తర్వులను వెలువరించారు. కాగా, గురువారం కమిటీ ప్రమాణస్వీకారోత్సవం చేసేందుకు సిద్ధం చేసుకుంటున్నారు. సభ్యుల ప్రమాణస్వీకారం అనంతరం ఉత్సవ కమిటీ చైర్మన్‌గా గాలి కృష్ణ పేరు ఏకగ్రీవంగా ప్రకటించనున్నారు.

ఫోన్లు వదిలి పుస్తకాలు పట్టాలి : ఎమ్మెల్యే పల్లా

జనగామ టౌన్, మార్చి 6: పిల్లలు స్మార్ట్ ఫోన్లను వదిలి పుస్తకాలు పట్టాలని, అప్పుడే మేధాశక్తి పెరుగుతుందని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. జనగామ మండలం వడ్లకొండలో గల గ్రీన్‌వుడ్ హైస్కూల్‌లో యానివర్సరీని పురస్కరించుకుని బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇటీవల ఫోన్ల వాడకం బాగా పెరిగి విద్యార్థులు ఎక్కువ సమయం వాటికే కేటాయిస్తున్నారన్నారు. తల్లిదండ్రులు ఫోన్లు ఇవ్వకుండా పుస్తకాలు అలవాటు చేయాలన్నారు. పదో తరగతి విద్యార్థులు ప్రణాళికతో చదివి మంచి ర్యాంకులు సాధించాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మహ్మద్ సల్లావుద్దిన్, ప్రిన్సిపాల్ షహనాజ్ భాను, మాజీ సర్పంచ్ శారద తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నేతలు



ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నేతలు

పాలకుర్తి, మార్చి 6 : పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన మాజీ వార్డు సభ్యులు మామిండ్ల లక్ష్మణ్, కమ్మగాని రమేష్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సలేంద్ర శ్రీనివాస్ బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. తొర్రూరులోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డిల సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులమై కాంగ్రెస్‌లో చేరామని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ పని చేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కమ్మగాని నాగయ్య, పన్నీరు వెంకన్న, పెనుగొండ రమేష్ ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి.

రేషన్ బియ్యం పట్టివేత

జఫర్‌గఢ్, మార్చి 6 : మండలంలోని కోనాయిచలంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ శీలం రవియాదవ్ తెలిపారు. కోనాయిచలంకు చెందిన ఉప్పలయ్య ఇంట్లో బుధవారం తనిఖీలు జరిపి ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

కొడకండ్ల, మార్చి 6 : మండలంలోని రామవరం గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరళ మాట్లాడుతూ మహిళా హక్కులపై, అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్లపై మహిళలకు అవగాహన కల్పించారు. మండల స్థాయిలో గురువారం ఎంపీడీవో కార్యాలయంలో వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యదర్శి నాగమణి, ఏఎన్ఎం ఎలీషా, అంగన్‌వాడీ టీచర్లు, పాల్గొన్నారు.

'గృహజ్యోతి' కోసం వివరాలు నమోదు చేసుకోవాలి

రఘునాథపల్లి, మార్చి 6:గృహజ్యోతి పథకం కింద తెల్లరేషన్ కార్డు కలిగిన వారు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పొందేందుకు అర్హులని ఎంపీడీవో గార్లపాటి శ్రీనివాసులు తెలిపారు. ఇప్పటి వరకు తమ పేరు నమోదు చేసుకొని వారి కోసం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నుంచి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో గృహజ్యోతికి అర్హులైన కుటుంబాలు 8,717 ఉండగా, ఇప్పటి వరకు 5,102 కుటుంబాల వివరాలు మాత్రమే ప్రజాపాలన పోర్టల్ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ అయ్యాయన్నారు. ఆధార్ కార్డుతో పాటు తెల్ల రేషన్ కార్డు, గతంలో వచ్చిన విద్యుత్ బిల్లుకు సంబంధించిన రిసిప్టు, ఫోన్ నంబర్ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటే మార్చి నెల నుంచి జీరో విద్యుత్ బిల్లు వస్తుందని ఎంపీడీవో తెలిపారు.

పాల బిల్లులు చెల్లించాలి

చిలుపూర్, మార్చి 6: నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న పాల బిల్లులను విజయ డెయిరీ యాజమాన్యం చెల్లించాలని శ్రీ కృష్ణ పాల ఉత్పత్తిదారుల సహకార సొసైటీ అధ్యక్షుడు సాదం రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని లాలాపేట్ విజయ భవన్ ఎదుట నిర్వహించే ధర్నాకు గ్రామం నుంచి పలువురు పాడి రైతులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. తెలంగాణ విజయ పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ లాలాపేటకు చెందిన యాజమాన్యం 15 రోజుల కోసారి బిల్లులు చెల్లించాల్సి ఉన్నప్పటికీ, నాలుగు నెలలు గడిచినా చెల్లించక పోవడంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు లీటర్ ఒక్కంటికి అందించే రూ.4 ఇన్సెంటివ్‌ను పాల బిల్లులతో కలిపి చెల్లించడంతో పాటు, 50 శాతం సబ్సిడీపై గడ్డి కట్టర్, పాలు పితికే మిషన్లు, దాణా పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సాదం నరసింహులు, సంగి రమేష్, సాదం అంజనేయులు, దాసరి ఆగులు, పిండి ప్రశాంత్, ఊరడి రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

లౌకికవాద ప్రజాస్వామ్య రక్షణకు పోరాడుదాం

▸▸ తెలంగాణ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జ్యోతి



సమావేశంలో మాట్లాడుతున్న నేదునూరి జ్యోతి

జనగామ టౌన్, మార్చి 6 : లౌకికవాద ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ పోరాడాలని తెలంగాణ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి పిలుపునిచ్చారు. జనగామ పట్టణంలో సుగుణమ్మ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మహిళా దినోత్సవ సభలో ఆమె మాట్లాడారు. మహిళలకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ప్రముఖ కార్మిక ఉద్యమ నాయకురాలు క్లార జెట్ కిన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోరాటం ప్రపంచ మహిళలకు దిక్సూచిగా నిలిచిందని, ఈ పోరాట విజయాన్ని కాంక్షిస్తూ మార్చి 8, 1910న అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. అప్రజాస్వామిక చర్యలతో లౌకిక స్ఫూర్తిని ప్రధాని మోదీ దెబ్బతీసేలా ప్రవర్తించడం సరికాదన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో లాభపడడానికి మోదీ నారీ వందనం పేరుతో మహిళా బిల్లును ప్రవేశపెట్టారని, దీనిని అమలు చేసేందుకు రెండేళ్లు పడుతుందని చెప్పడం మహిళలను మోసగించడమేనని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.రాజారెడ్డి, తెలంగాణ మహిళా సమాఖ్య నాయకులు చింతగింజ అరుణ, పండుగ నిర్మల, జి. సఖి, పద్మ, తేజ, విజయ, సువర్ణ, వీరమ్మ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛ, సమానత్వం కోసం ఉద్యమించాలి

బీజేపీ అనుసరిస్తున్న మతోన్మాద విధానాలను ప్రతిఘటించి మహిళలు స్వేచ్ఛ, సమానత్వం కోసం పోరాడాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ. షబానా అన్నారు. స్థానిక ఐద్వా కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కొండా వరలక్ష్మి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో షబానా మాట్లాడారు. మహిళా హక్కులు మానవ హక్కుల్లో భాగమేనన్నారు. పోరాడి సాధించుకున్న మహిళా చట్టాలను బీజేపీ ప్రభుత్వం రద్దు చేసి పారిశ్రామిక వేత్తల లాభాల కోసం నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందని విమర్శించారు. దేశ వ్యాప్తంగా మహిళలు, పిల్లలపై అత్యాచారాలు, దాడులు పెరిగిపోయాయన్నారు. సమావేశంలో ఐద్వా నాయకురాళ్లు సీహెచ్.శ్రీలత, ఎండీ.గౌసియా, చంద్రకళ, కమల, గుంటుపల్లి సబిత, సిరిగిరి స్వరూప తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంలో సాంకేతికతే 'రైతు నేస్తం' లక్ష్యం

▸▸ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



ఛాగల్‌లో రైతు నేస్తం కార్యక్రమాన్ని వీక్షిస్తున్న కలెక్టర్, అధికారులు

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 6 : వ్యవసాయంలో సాంకేతికతను తీసుకువచ్చి రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయడానికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతు నేస్తం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా తెలిపారు. రైతు నేస్తం కార్యక్రమాన్ని సీఎం, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గానికి ఒకటి చొప్పున 110 రైతు వేదికల్లో బుధవారం ప్రారంభించారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి సంబంధించి మండలంలోని చాగల్ గ్రామ రైతు వేదికలో కార్యక్రమం ప్రారంభం కాగా, కలెక్టర్ హాజరై వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి ప్రభుత్వం ప్రయోగాత్మకంగా ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో ఒక కేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ఉగాది నాటికి అన్ని రైతు వేదికల్లో వీసీ అందుబాటులోకి తీసుకువచ్చేలా ప్రభుత్వం యోచిస్తుందన్నారు. వీసీ కార్యక్రమాలకు రైతులు హాజరై పంటలకు సంబంధించిన ఏ సమస్య ఉన్నా నేరుగా తెలుపవచ్చని అన్నారు. వాటికి సంబంధిత అధికారులు వెంటనే పరిష్కార మార్గం చూపుతారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వినోద్‌కుమార్, ఆర్డీవో డీఎస్ వెంకన్న, నర్సయ్య, ఎంపీవో సుధీర్ కుమార్, ఏవో చంద్రన్‌కుమార్, విద్యుత్ డీఈఈ హన్సీన్‌నాయక్, ఏఈ చంద్రమౌళి, డీటీ విజయ్‌కుమార్, మార్కెట్‌సెక్రటరీ జన్ను భాస్కర్, నీల ఐలేష్, ఎంపీటీసీ కనకం స్వరూప-గణేష్, ఏఈవోలు దీపక్, ఈశ్వరి, సనా, సెక్రటరీ అశ్విన్‌కుమార్, రైతులు రాఘవరెడ్డి, గాండ్ల మల్లికార్జున్, పొన్న రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఆధునిక పద్ధతులు పాటించాలి : ఎమ్మెల్యే

జనగామటౌన్: రైతులు వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు పాటించి మంచి దిగుబడులు సాధించాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. జనగామ మండలంలోని గానుగుపహాడ్ రైతు వేదికలో బుధవారం 'రైతు నేస్తం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని పల్లా రాజేశ్వర్‌రెడ్డి కలెక్టర్ రిజ్వాన్ బాషాతో కలిసి వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు డిమాండ్ ఉన్న పంటల వైపు మొగ్గు చూపాలన్నారు. ఒకే రకం పంటలు వేయకుండా వ్యవసాయాధికారుల సూచనలు తీసుకుని రకరకాల పంటలు సాగు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, హార్టికల్చర్ అధికారి లత, వివిధ మండలాల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

ఖిలాషాపూర్‌లో వివాహిత ఆత్మహత్య

రఘునాథపల్లి, మార్చి 6: మానసికంగా భయాందోళనకు గురైన ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మండలంలోని ఖిలాషాపూర్‌లో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం... ఖిలాషాపూర్‌కు చెందిన యామంకి సుధాకర్‌తో రాధిక(33)కు 15 సంవత్సరాల క్రితం వివాహమైంది. అయితే బచ్చన్నపేట మండలానికి చెందిన పోచంపల్లి శ్రీనివాస్‌కు చెల్లెలు అయిన రాధిక మధ్యాహ్నం ఫోన్ చేసి మా ఇంటి పక్కన ఉన్న ఉమేష్ అన్న చెల్లి రాత్రి కలలోకి వచ్చి తనను రమ్మంటుందని భయం భయంగా చెప్పిందన్నారు. ఈ క్రమంలోనే రాధిక భయాందోళనకు గురై ఇంట్లో ఉరి వేసుకొని చనిపోయిందని తెలిపారు. ఆమెకు భర్త, కుమారుడు చరణ్ తేజ, కూతురు భూమిక ఉన్నారు. కాగా, మృతురాలి అన్న శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.నరేష్ తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు

పాలకుర్తి, మార్చి 6 : మండలంలోని వల్మిడి గ్రామానికి చెందిన కూటికంటి సతీష్ అనే గీత కార్మికుడు బుధవారం తాటిచెట్టు పైనుంచి పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. రోజు వారిగా కల్లు తీసేందుకు తాటిచెట్టు ఎక్కి దిగుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడ్డాడు. గాయపడిన సతీష్‌ను పాలకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్‌కు తీసుకెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడి మృతి

జఫర్‌గఢ్, మార్చి 6: మండలంలోని ఏబీతండాకు చెందిన భూక్య వెంకట్రాంనాయక్ (60) రోడ్డు ప్రమాదంలో గాయపడగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. వెంకట్రాంనాయక్-రంగమ్మ దంపతులు స్టేషన్‌ఘన్‌పూర్ మండలం పల్లగుట్ట క్రాస్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం విదితమే. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వెంకట్రాంనాయక్ జనగామ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం చనిపోయినట్లు తండావాసులు తెలిపారు. స్వల్పంగా గాయపడిన అతని భార్య కోలుకుంటున్నట్లు చెప్పారు. కాగా, వెంకట్రాంనాయక్‌కు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

కూలీలకు పని కల్పించాలి

▸▸ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సుధాకర్

జఫర్‌గఢ్, మార్చి 6 : జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనితో పాటు పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వడ్లకొండ సుధాకర్ డిమాండ్ చేశారు. మండలంలోని తమ్మడపల్లి (జి)లో బుధవారం సంఘం ఆధ్వర్యంలో ఉపాధి కూలీలచే సమావేశం నిర్వహించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ఉపాధి కూలీల సంఖ్య పెంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పనిచేసే చోట కనీస సౌకర్యాలు లేక కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఉపాధి కూలీలకు పనిముట్లను అందించి, పని ప్రదేశంలో మెడికల్ కిట్లు, తాగునీరు, టెంట్లు వంటి కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే కొలతలతో నిమిత్తం లేకుండా ప్రతి కూలీకి రోజుకు రూ.800 కూలీ డబ్బులు చెల్లించాలని, పని దినాలను ఏడాదికి 200 రోజులకు పెంచాలని డిమాండ్ చేశారు. పని చేసిన ఉపాధి కూలీలకు 15 రోజుల్లోగా డబ్బులు చెల్లించాలన్నారు. ఉపాధి కూలీల సమస్యలపై వ్యవసాయ కార్మిక సంఘం పోరాడుతుందన్నారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు కన్నెబోయిన నాగయ్య, చిలువేరు మల్లేశ్, వేల్పుల చిన్నరాములు, ఎండి.షబానా, చొప్పరి వెంకటమ్మ, ఎల్లమ్మ, రాములు, నక్క యాకయ్య, కూలీలు పాల్గొన్నారు.

ఆదరణకు నోచుకోని నల్లపోచమ్మ ఆలయం

▸▸ దశాబ్దాలు దాటినా కానరాని అభివృద్ధి

▸▸ కనీస సౌకర్యాలు కల్పించాలని భక్తుల వేడుకోలు




సోలిపూర్ గ్రామ శివారులో గల నల్లపోచమ్మ దేవాలయం

తరిగొప్పుల, మార్చి 6: మహిమ గల తల్లి.. ఉమ్మడి నర్మెట మండల ప్రజలు, రైతుల పాలిట కల్పవల్లి. ఆ తల్లికి మొక్కులు చెల్లించనిదే రైతులు పంట కోయరు. ఏ జాతరకు వెళ్లినా, అక్కడ ఎదురు మొక్కులు చెల్లించే వెళ్తారు. అంతటి మహిమ గల నల్లపోచమ్మ తల్లి గుడిపై పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. తరిగొప్పుల, సోలిపూర్, పోతారం, అక్కరాజుపల్లి గ్రామాల సరిహద్దుల్లో శతాబ్ద కాలం క్రితం వెలసిన నల్లపోచమ్మ దేవాలయాన్ని పాలకులు పట్టించుకోవడం లేదని భక్తులు వాపోతున్నారు. సోలిపూర్ గ్రామం నుంచి 2.5 కిలో మీటర్లు, తరిగొప్పుల నుంచి 3 కిలోమీటర్లు, పోతారం నుంచి 3 కిలోమీటర్లు, అక్కరాజుపల్లి నుంచి 4 కిలోమీటర్ల దూరంలో ఆలయం ఉంటుంది. ఈ నాలుగు గ్రామాల ప్రజలు నల్లపోచమ్మను తలుచుకోనిదే ఏ పని ముట్టుకోరు. అమ్మవారిని దర్శించుకునేందుకు ప్రతీ ఆదివారం, గురువారం రాష్ట్ర నలుమూలల నుంచేగాక ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వస్తుంటారు. సెలవు దినాల్లో మండలంలోని పలు గ్రామాల నుంచి తల్లిదండ్రులు ఆట విడుపుకు తమ పిల్లలతోపాటు ఇక్కడికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని సరదాగా గడిపి వెళ్తుంటారు. ఇంతటి ప్రాశస్త్యం కలిగిన నల్లపోచమ్మ గుడి 50 సంవత్సరాలుగా ఎలాంటి ఆదరణకు నోచుకోవడం లేదు. రోజు రోజుకు ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతుండటంతో కనీస సౌకర్యాలైన మరుగుదొడ్లు, విద్యుత్, తాగునీటి వసతులు సరిగ్గా లేకపోవడంతో భక్తులు మొక్కులు చెల్లించే సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు, భక్తులు కోరుతున్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

- తాళ్లపల్లి పోషయ్య గౌడ్, బీఆర్ఎస్ నేత తరిగొప్పుల



అమ్మవారిని దర్శించుకునేందుకు రోజు రోజుకు ఆలయానికి భక్తులు పోటెత్తుతున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ పరిసర ప్రాంతాల్లో విశ్రాంతి గదులతో పాటు మరుగుదొడ్లు నిర్మించాలి. సెలవు దినాల్లో తల్లిదండ్రుల తమ పిల్లలను ఆట విడుపు కోసం ఇక్కడికి తీసుకొస్తున్న నేపథ్యంలో ఉద్యావనాలు ఏర్పాటు చేసి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలి.

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారమే ఫోరం లక్ష్యం



మాట్లాడుతున్న చైర్మన్ తిరుమలరావు

రఘునాథపల్లి, మార్చి 6 : విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు వారు ఎదుర్కొంటున్న సమస్యల సత్వర పరిష్కారమే ఫోరం లక్ష్యమని సీజీఆర్ఎఫ్-1, టీఎస్ ఎన్‌పీడీసీఎల్ ఫోరం వరంగల్ చైర్మన్ కె.తిరుమలరావు అన్నారు. మండలంలోని ఖిలాషాపూర్ సబ్‌స్టేషన్ ఆవరణలో బుధవారం జరిగిన విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక కార్యక్రమానికి తిరుమలరావుతో పాటు కమిటీ ఫైనాన్స్ మెంబర్ ఆర్.చరణ్‌దాస్, ఇండిపెండెంట్ మెంబర్ యస్.వీరేందర్ హాజరై మాట్లాడారు. విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడానికి సిబ్బంది అంకితభావంతో పని చేయాలని అన్నారు. వినియోగదారులను ఇబ్బందులు పెడితే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. వినియోగదారులు తమ సమస్యలను పరిష్కరించడానికి ఎస్ఈ, డీఈ, ఏడీఈ, ఏఈ తదితర అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. మీటర్లలో లోపాలు, వోల్టేజీ హెచ్చు తగ్గుదల, లోడు వివాదం, కొత్త సర్వీసుల విషయంలో సిబ్బంది నిర్లక్ష్య ధోరణి పట్ల చాలా ఫిర్యాదులు వచ్చాయని అన్నారు. వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో వినియోగదారుల నుంచి పది సమస్యలు రాగా, ఆరింటిని పరిష్కరించామని తెలిపారు. మిగతా నాలుగు సమస్యలను రిజిస్టర్ చేశామన్నారు. గృహలక్ష్మికి సంబంధించి తెల్ల రేషన్‌కార్డు కలిగిన వారందరికి నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకంను అర్హులైన వారందరు ఉపయోగించుకోవాలన్నారు. వినియోగదారులు 9440811299, 8333923840, 9491307004లకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ వేణుగోపాల్, డీఈ లక్ష్మీనారాయణ రెడ్డి, ఏడీఈ మనోహర్ రెడ్డి, ఏఈలు రవిందర్, రాహుల్, నర్సింహులు, నాగేందర్, సిబ్బంది వీరాంజనేయులు, వేణు, వెంకటయ్య పాల్గొన్నారు.